తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి


లింగంపేటలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మండలాల ప్రత్యేకాధికారులు సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శులతో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు గ్రామాల్లో స్పెషల్‌డ్రైవ్ చేపట్టి తాగునీటి సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించాలన్నారు. దీంతోపాటు గ్రామాల్లోని మంచినీటి ట్యాంకుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఉండేలా చూడాలన్నారు. 3 నెలలకు సరిపడా బ్లీచింగ్ పౌడర్‌ను గ్రామ పంచాయతీలలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అత్యవసర సమయాలలో తాగునీటిని సరఫరా చేసేందుకు బోరుమోటార్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్


నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి రత్నం


తాడ్వాయిలో .. ప్రత్యేక అధికారి రాజారాం


రాజంపేటలో.. మండల ప్రత్యేక అధికారిణి అపర్ణ


బీబీపేటలో .. ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్

క్లుప్తంగా

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ ఎంపీడీవోగా అనితారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం పై అంతస్తులో కొత్త మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ మేరకు నిజాంసాగర్ ఎంపీడీవో గంగాధర్ మహమ్మద్ నగర్ ఎంపీడీవోగా అనితారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. మండల పరిషత్ సిబ్బంది విష్ణు, కారోబార్ అంబయ్య తదితరులు ఉన్నారు.

ఎంఐఎంలో పలువురి చేరిక



బాన్సువాడ రూరల్: ఎంఐఎం పార్టీలో శుక్రవారం పలువురు యువకులు, ఇతర పార్టీల నాయకులు చేరారు. వారందరికి మండల కేంద్రంలోని కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సయీుద్‌ఖాన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అసదుద్దీన్ ఓవైసీ మార్గదర్శకత్వంలో మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ కార్యదర్శి ఆతీఫ్ అజీమ్, అహ్మద్ నవాబ్, అమ్జద్, లాయఖ్ పాల్గొన్నారు.

'ప్రజాసమస్యలపైనే గద్దర్ పోరాటం'

బాన్సువాడ రూరల్: విప్లవ గాయకుడు గద్దర్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కోసం నిరంతరం పోరాడారని మాలసంఘం బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. శుక్రవారం ఆయన బాన్సువాడలో గద్దర్ జయంతి నిర్వహించి మాట్లాడారు. ఎలాంటి పదవులు ఆశించకుండా, ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడిన మహనీయుడని కొనియాడారు. మాల సంఘం తెలంగాణ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, నాయకులు బంగారు మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్పృహ కోల్పోయిన సస్పెన్షన్‌కు గురైన హెచ్‌ఎం




ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ మాణిక్యం స్పృహ కోల్పోయినట్లు ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎండీఎం భోజనం వికటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం మాణిక్యంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకునేందుకు వచ్చిన మాణిక్యం స్పృహ తప్పి పడిపోవడంతో అక్కడున్న ఉపాధ్యాయులు ఆయనకు సీపీఆర్ చేశారు. అనంతరం మాణిక్యంను జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు కుశాల్, ఉపాధ్యాయులు పరామర్శించారు.

రోడ్డు భద్రతపై విద్యార్థుల ర్యాలీ



బీబీపేట: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ..రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎస్సై ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్డీవోకు అభినందనలు



కామారెడ్డి అర్బన్: ఉద్యోగ విరమణ చేసిన కామారెడ్డి ఆర్డీవో వై.రంగనాథ్‌రావును శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ప్రజలకు సేవలు అందించడంలో ఆర్డీవో రంగనాథ్‌రావు ఎంతో శ్రద్ధ వహించే వారని చంద్రకాంత్‌రెడ్డి అభినందించారు. ఆర్డీవో కార్యాలయం, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపి శిబిరం

పిట్లం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ కమల్ కిశోర్ మాట్లాడారు. ఫిజియోథెరపి క్యాంపులో భాగంగా ఇక్కడికి వచ్చిన వైద్యులు సారిక 9 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇంటి వద్ద చేసే వ్యాయామాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన


పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఆర్డీవో

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్డీవో మన్నె ప్రభాకర్ శుక్రవారం మధ్యాహ్న భోజనం చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో పాత ఎండీఎం ఏజెన్సీని తొలగించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులు వండిన వంటలను ఆర్డీవో రుచి చూశారు. విద్యార్థులకు మంచి భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్ తదితరులున్నారు.

'వడ్డెర వృత్తిదారుల సంక్షేమానికి నిధులు కేటాయించండి'


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర వృత్తిదారులు

కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో వడ్డెర వృత్తిదారుల సంక్షేమానికి సరిపడా నిధులను కేటాయించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డెరలు ఉపాధి పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కంకర క్వారీలను వడ్డెర సొసైటీలకు ఇవ్వాలని కోరారు. అనంతరం సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలయ్య, జిల్లా అధ్యక్షుడు నర్సింలు, తదితరులున్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


బహుమతులు అందిస్తున్న ఎంఈవో ఆనంద్‌రావు

రామారెడ్డి: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రామారెడ్డి ఎంఈవో ఆనంద్ రావు పిలుపునిచ్చారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా ఫోరమ్ ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్‌పీఎస్‌టీ) రామారెడ్డి మండల శాఖ నిర్వహించిన మండల స్థాయి ఆన్లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎంఈవో ఆనందరావు హాజరై మాట్లాడారు. నిత్య జీవితంలో సైన్స్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు సైన్స్‌ను ఆసక్తితో చదవాలని సూచించారు. టాలెంట్ టెస్ట్‌లో పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 4న జరిగే జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో వీరు పాల్గొంటారని ఎంఈవో పేర్కొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



రామారెడ్డి: మండలంలోని రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని, లబ్ధిదారులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందించాలని తహసీల్దార్ సువర్ణ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల రేషన్ డీలర్లతో తహసీల్దార్ సువర్ణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు పడిగెల రత్నాకర్, నాగరాజ్, శెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డికి అధిక నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్: కేంద్ర బడ్జెట్లో కామారెడ్డి జిల్లాకు అధిక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కందూరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. 11 ఏళ్లుగా జిల్లాకు కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి సహకారం లేదని, ఈ బడ్జెట్ సమావేశాలలో వెనుకబడిన కామారెడ్డి జిల్లాను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మన్మాడ్ నుంచి సికింద్రాబాద్ వరకు డబుల్ రైల్వేలైన్, అలాగే కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ మీదుగా కొత్త రైల్వేలైన్ కోసం కావాల్సిన నిధులు కేటాయించాలని కోరారు. పట్టణంలోని అశోక్ నగర్ కాలనీ, పాత రాజంపేట రైల్వే గేట్‌ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు వెంకట్ గౌడ్, మోతిరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని శిక్షకులు రాంనారాయణగౌడ్, శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో పోషకాహారలోప నివారణపై శుక్రవారం గ్రామసంఘ సభ్యులతోపాటు వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల్లో పోషకాహారలోపం వల్ల శారీరక ఎదుగుదల, మానసిక వికాసం బలహీన పడుతుందన్నారు.

ఎంపీటీసీ స్థానాల సవరణ జాబితా విడుదల


ఎంపీటీసీ స్థానాల జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో అనితారెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని 10 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన సవరణ జాబితాను శుక్రవారం ఎంపీడీవోలు గంగాధర్, అనితారెడ్డి విడుదల చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఎంపీటీసీ స్థానాలు, గ్రామాలకు సంబంధించిన మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు రెండు రోజులు గడువు ఉందని ఎంపీడీవోలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



భిక్కనూరు: భిక్కనూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పురం రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా చల్ల లక్ష్మణ్, కోశాధికారిగా కొడిప్యాక వెంకటేశంలను ఎన్నుకున్నారు.

ఎంపీటీసీ స్థానాలను పెంచాలి



మద్నూర్(జుక్కల్): ఎంపీటీసీ స్థానాలను పెంచాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవో రాణికి వినతి పత్రం అందించారు. ఎంపీటీసీల ముసాయిదా జాబితా ప్రకారం మండల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని వారు అన్నారు. జనాభా లెక్కల ప్రకారం మద్నూర్ మండలంలో మరో రెండు స్థానాలను ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు తుకారాం, నాయకులు కృష్ణపటేల్ తదితరులున్నారు.

ఎంపీటీసీ పరిధిని వేరు చేయాలి



మద్నూర్(జుక్కల్): కొత్తగా ఏర్పాటైన డోంగ్లీ మండలంలో నూతన ఎంపీటీసీల పరిధులను ఏర్పాటు చేశారు. మండలంలోని దోతి, మల్లాపూర్, మారేపల్లి, లక్ష్మాపూర్, మొగా గ్రామాలను కలిపి ఎంపీటీసీ పరిధిని నిర్ణయించగా.. ఇందులోంచి మొగా గ్రామాన్ని తొలగించాలంటూ శుక్రవారం పలు పార్టీల నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు మద్నూర్ ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చి వినతి పత్రం అందించారు. నాయకులు కాశీనాథ్ పటేల్, శ్రీకాంత్ పటేల్, సంజయ్, ప్రవీణ్, వసంత్ రావ్ పాటిల్, వీరేష్ గొండ, శాంతేశ్వరప్ప, శ్రీకాంత్ తదితరులున్నారు.

అచ్చంపేట ఎంపీటీసీ స్థానాన్ని యథావిధిగా ఉంచండి



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామ ఎంపీటీసీ స్థానాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో గంగాధర్‌కు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. అచ్చంపేట ఎంపీటీసీ పరిధిలో ఆరేపల్లి గ్రామాన్ని కలపవద్దని కోరారు. గతంలో ఉన్న తమ గ్రామాన్ని అచ్చంపేట ఎంపీటీసీగా యథావిధిగా ఉంచాలని కోరారు.

ఆధ్యాత్మికం..

షిరిడీ సాయి ఆలయ సందర్శన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లిలో గల షిరిడీ సాయి ఆలయాన్ని శుక్రవారం ఎన్‌ఆర్‌ఐ బృంద సభ్యులు సందర్శించారు. ఆలయ ధర్మకర్త పట్లోళ్ల మోహన్ రెడ్డి(ఎన్‌ఆర్‌ఐ) ఏర్పాటు చేసిన ఆలయ నిర్మాణం, భక్తుల తాకిడిని వారు పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి సన్మానించారు. ఎన్‌ఆర్‌ఐ బృంద సభ్యులు వి.రమేష్ రెడ్డి, వి.విఠల్ రెడ్డి, డీఎస్‌ఆర్ రాజు, అనుపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నందు రెడ్డి, పోతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వరాలయం..

భిక్కనూరు: దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయాన్ని యోగా గురువు రాందేవ్ బాబా శిష్యుడైన పరమార్థదేవ్ స్వామీజీ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ప్రారంభమైన అపురూప అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు కాలడి ఆది శంకర మఠం బ్రహ్మశ్రీ ఉన్నికృష్ణన్ సంబూద్రి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే సదాశివనగర్‌కు చెందిన సనాతన భజన మండలి సభ్యులు ఆలపించిన భజన కీర్తనలు ఆకట్టుకున్నాయి. అన్నదానం చేశారు.

మెహర్ బాబా పుణ్యతిథిలో మాజీ ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్): మహారాష్ట్రలోని హైమద్‌నగర్ మెహర్ బాబా ఆలయంలో శుక్రవారం నిర్వహించిన పుణ్యతిథి కార్యక్రమానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే హాజరయ్యారు. జుక్కల్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మెహర్ బాబా సమాధి వద్ద మౌనం పాటించారు. నాయకులు నాల్చర్ రాజు, పాకల్‌వార్ విజయ్ తదితరులు ఉన్నారు.



మెహర్ బాబా భక్తుల మౌనం

కామారెడ్డి అర్బన్: అవతార్ మెహర్‌బాబా అమరతిథి సందర్భంగా స్థానిక అయ్యప్పనగర్, గర్గుల్ బాబా సెంటర్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మౌనం పాటించారు. పలువురు భక్తులు భజనలు, పతాకావిష్కరణ, విశేష పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. మౌనం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని బాబా భక్తులు నమ్ముతారు.

జగదాంబ, సేవాలాల్ మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠాపన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో జగదాంబ, సేవాలాల్ మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఆలయం వద్ద మూడురోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. పురోహితులు శివకుమార్ శర్మ, పూజారి కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వనితాశక్తి మహిళల పూజలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులో గల త్రిలింగేశ్వరాలయంలో ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ ఆధ్వర్యంలో వనితాశక్తి-3కు చెందిన మహిళలు శుక్రవారం ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ విశిష్ఠతను తెలుసుకున్న వారు ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు


కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బొమ్మన్‌దేవ్‌పల్లిలో జరుగుతున్న అల్లమా ప్రభు ఆలయ జాతర సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొనడంతో కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన కుస్తీ వీరులకు గ్రామ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. గెలుపొందిన మల్లయోధులకు బహుమతులు అందించి సన్మానం చేశారు.

సంక్షిప్తం

మున్నూరుకాపు యువత జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్

బీబీపేట: మున్నూరుకాపు యువత జిల్లా అధ్యక్షుడిగా కోనాపూర్ గ్రామానికి చెందిన కేతి ప్రశాంత్ నియమితులయ్యారు. ఈమేరకు మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ నియామక పత్రాన్ని అందించారు.

నియోజకవర్గ ఇంచార్జిగా దత్తాత్రేయ

తాడ్వాయి: తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ముదాం దత్తాత్రేయ మున్నూర్ కాపు యువత నియోజకవర్గం ఇన్‌చార్జిగా శుక్రవారం నియమితులైనట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. యువత రాష్ట్ర కార్యదర్శి దొంగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

పాఠశాల బోరుమోటారు ప్రారంభం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని సరంపల్లి ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని తాజా మాజీ కౌన్సిలర్ ఆకుల రూప, రవికుమార్‌లు బోరు వేయించగా కొందరు దాతలు మోటారు విరాళంగా ఇచ్చి బిగించారు. శుక్రవారం బోరు మోటారును ఆమె ప్రారంభించారు. నేతలు కొత్తూరు పెద్ద సాయిలు, ముల్క శ్రీనివాస్, అశోక్‌రావు, నవీన్, రాజారామ్, రాజు, కృష్ణ, హెడ్‌మాస్టర్ అనిల్ పటేల్, పాఠశాల కమిటీ చైర్మన్ పి.సంధ్య తదితరులున్నారు.

అంబేడ్కర్‌పై ఉపన్యాస పోటీలు

భిక్కనూరు: యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5 కార్యక్రమంలో భాగంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బస్వాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాం వెంకటేశ్, నాయకులు జీవన్, కిరణ్, ఎల్లం, గణేశ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి

రాజంపేట: బకాయి వేతనాలు చెల్లించాలని కోరు తూ శుక్రవారం మండల పరిషత్ అధికారి(ఎంపీడీవో) రఘురామ్‌కు ఈ-పంచాయతీ ఆపరేటర్లు విన తి పత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాల యంలో ఆపరేటర్లుగా పనిచేస్తున్న తమకు ఆరు నె లల నుంచి వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇ బ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వేతనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సానిటేషన్ కార్మికులకు..

ఎల్లారెడ్డిరూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న సానిటేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏఐసీటీయూ నాయకులు బాలరాజ్, దశరథ్‌లు శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వేతనాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: దోమకొండ మండలం ముత్యంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యే కేవీఆర్‌ను కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నెల 29న రాత్రి ముత్యంపేట మాజీ ఉపసర్పంచ్ శిరీష్ గౌడ్, ఆయన అనుచరులు ఉద్దేశపూర్వకంగా డీసీఎం వాహనంతో పాఠశాల ప్రహరీ కూల్చివేశారని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే, ఎస్పీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.